క్లుప్తంగా

శాకంబరి అలంకరణలో వాసవీ మాత



సత్తెనపల్లి: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని పట్టణంలోని మాచర్ల రోడ్డులో ఉన్న శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి వివిధ రకాల కూరగాయలతో శాకంబరి కవచం అలంకరణ చేపట్టారు. భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

'ఉపాధి హామీ' ప్రజావేదిక నేడు

ముప్పాళ్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 2023–24 ఆర్థిక సంవత్సర ప్రజావేదిక సభ శనివారం జరుగుతుందని ఆ పథకం ఏపీఓ జి.ఏడుకొండలు శుక్రవారం తెలిపారు. సామాజిక తనిఖీల్లో గుర్తించిన అంశాలపై ఉదయం 11 గంటలకు ప్రజావేదిక నిర్వహిస్తామని చెప్పారు. పథకంలో అక్రమాలు, సమస్యలుంటే అధికారుల దృష్టికి తీసుకు రావచ్చన్నారు.

పౌరాణిక కళాకారుడికి అభినందనలు



సత్తెనపల్లి: పట్టణానికి చెందిన పౌరాణిక కళాకారుడు బెజగం రవికుమార్ 'అల్లూరి సీతారామరాజు నట కళా సామ్రాట్' పురస్కారాన్ని అందుకున్నందుకు పలువురు అభినందించారు. శ్రీశైలం దేవస్థానం కమిటీ, లిటిల్ ఛాంప్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం వివిధ రంగాల ప్రముఖులకు జరిగిన అవార్డుల ప్రదానం, సన్మాన కార్యక్రమంలో ఆయనకు ఈ పురస్కారం అందించారు. రెండు తెలుగు రాష్ట్రాల ప్రేక్షకులను అలరిస్తున్నందుకు అవార్డుకు ఎంపిక చేశారు. రవికుమార్‌కు అశోక చక్రం ప్రత్యేక జ్ఞాపిక, ప్రశంసాపత్రం కూడా ప్రదానం చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయనకు సత్తెనపల్లిలోని వివిధ కళా సంస్థల సభ్యులు అభినందనలు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ముప్పాళ్ల: చెరువులో జారి పడిన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని లంకెలకూరపాడు గ్రామానికి చెందిన పచ్చల రామయ్య(53) గ్రామంలోని చెరువుకు కాపలాగా ఉంటాడు. ఈ నెల 12వ తేదీన చెరువులో జారిపడ్డాడు. తెల్లవారిన తర్వాత స్థానికుల సాయంతో చికిత్స నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు ఎస్సై పి.హజరతయ్య తెలిపారు. రామయ్యకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

'రైతులకు పెట్టుబడి సాయం అందించాలి'



అమరావతి: కౌలు రైతులు, వ్యవసాయ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం మండల పరిధిలోని మునగోడు తదితర గ్రామ పంచాయతీ కార్యదర్శులకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల కన్వీనర్ బి. సూరిబాబు మాట్లాడుతూ.. గతేడాది తుపాను కారణంగా పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలన్నారు. యజమానుల సంతకంతో సంబంధం లేకుండా గ్రామసభల్లో కౌలు రైతులను గుర్తించి కార్డులు ఇవ్వాలని పేర్కొన్నారు. ఖరీఫ్ సీజన్ ఆరంభమైన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు రూ.20 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉపాధి కూలీలకు బిల్లులు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు సయ్యద్ మొహిద్దీన్, కృష్ణ,ఎస్కే రఫీ, ఎం. సుబ్రహ్మణ్యం, నండూరి వెంకటేశ్వరరాజు, సయ్యద్ రహీంతుల్లా, పరమేశ్వరరావు, మేకల నీలగిరి తదితరులు పాల్గొన్నారు.

పత్తి రైతుకు 'గులాబీ' గుబులు

మెట్ట రైతుల పాలిట వరంగా భావించే పత్తి సాగు విస్తీర్ణం క్రమంగా తగ్గిపోతోంది. ముఖ్యంగా గులాబీ పురుగుల ఉద్ధృతి, తెగుళ్లు, తుపానులు, పెరిగిన పెట్టుబడులు, కోత కూలీల కొరత ప్రభావంతో రైతులు దీనిపై ఆసక్తి చూపడం లేదు. ఐదేళ్ల సాగు ప్రామాణికంగా వ్యవసాయ శాఖ అధికారులు సాధారణ సాగు విస్తీర్ణాన్ని నిర్ణయిస్తారు. ఆ ప్రకారం సత్తెనపల్లి రెవెన్యూ డివిజన్ పరిధిలో ఈ ఏడాది సగానికి పైగా పత్తి సాగు విస్తీర్ణం తగ్గిపోవడం గమనార్హం.

- సాగుపై అన్నదాతల తీవ్ర నిరాసక్తత
- సత్తెనపల్లి డివిజన్‌లో భారీగా తగ్గిన విస్తీర్ణం
- ప్రత్యామ్నాయ పంటల వైపు చూపు





భీమవరంలో సాగు చేస్తున్న పత్తి పంట

సత్తెనపల్లి: సత్తెనపల్లి రెవెన్యూ డివిజన్ పరిధిలో సత్తెనపల్లి, ముప్పాళ్ల, రాజుపాలెం, నకరికల్లు, పెదకూరపాడు, అమరావతి, అచ్చంపేట, క్రోసూరు, బెల్లంకొండ మండలాలు ఉన్నాయి. ఇక్కడ మొత్తం 39,050 హెక్టార్లలో ఖరీఫ్‌లో పత్తి పంట సాధారణ సాగు కాగా.. ఈ ఏడాది కేవలం 12,481 హెక్టార్లకే పరిమితమైంది. తెగుళ్లు, గులాబీ పురుగుల దాడి, పంట మార్పిడిపై అధికారుల సూచనలు పాటించకపోవడమే కారణమని తెలుస్తోంది. ఎకరాకు రూ. 36 వేల నుంచి రూ. 50 వేల వరకు పెట్టుబడులు పెట్టినా ప్రయోజనం మాత్రం లేకుండా పోతోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి 'వైఎస్సార్ రైతు భరోసా' కింద పెట్టుబడి సాయం సమయానికి అందించేవారు. ఇప్పుడు పీఎం కిసాన్ నిధి కింద రూ.2 వేలు మాత్రమే అందడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రూ.20 వేలు పెట్టుబడికి ఇస్తామని టీడీపీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించినా ఇంతవరకు అమలు చేయలేదు. రైతన్నలు ఆ సాయం కోసం ఎదురుచూస్తున్నారు. ప్రత్యామ్నాయంగా అపరాలు, మొక్కజొన్న, ఉద్యాన పంటలపై దృష్టి సారించారు. మరోవైపు అల్పపీడన ప్రభావంతో భారీ వర్షాలు పడతాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో పత్తి వైపు మొగ్గు చూపిన రైతులు కూడా ప్రస్తుతం ఆందోళనకు గురవుతున్నారు.

సత్తెనపల్లి రెవెన్యూ డివిజన్లో పత్తి సాగు విస్తీర్ణం వివరాలు (హెక్టార్లలో..)

మండలం	సాధారణ విస్తీర్ణం	ప్రస్తుత విస్తీర్ణం
సత్తెనపల్లి	6,596	1,870
ముప్పాళ్ల	2,849	140
రాజుపాలెం	1,906	312
నకరికల్లు	521	26
పెదకూరపాడు	5,724	2,200
అమరావతి	7,550	3,785
అచ్చంపేట	5,343	1,014
క్రోసూరు	5,497	2,827
బెల్లంకొండ	3,064	307
మొత్తం	39,050	12,481

పెండింగ్ బిల్లులు చెల్లించాలని వినతి



గ్రామ సచివాలయంలో అర్జీ అందిస్తున్న ప్రతినిధులు

88త్యాళ్లూరు(క్రోసూరు): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కూలీలకు బకాయిలను వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి జి.రవిబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం రైతు, కౌలు రైతు – వ్యవసాయ కార్మిక సంఘాల రాష్ట్ర కమిటీల పిలుపు మేరకు ఈ సమస్యలపై మండలంలోని క్రోసూరు, 88 త్యాళ్లూరు, దొడ్లేరు సచివాలయాల వద్ద నిరసన తెలిపారు. అధికారులకు అర్జీలు అందించారు. ఈ సందర్భంగా జి.రవిబాబు మాట్లాడుతూ.. పథకం కింద గత సంవత్సరం కూలీలకు 4 నుంచి 5 వారాల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. పథకాన్ని 200 రోజులకు పెంచాలని కోరారు. ఖరీఫ్ ప్రారంభమైన నేపథ్యంలో పెట్టుబడికి రూ. 20 వేల సాయం అందించాలని డిమాండ్ చేశారు. యజమానితో సంబంధం లేకుండా కౌలు రైతులకు, భూమి లేని కౌలు రైతులకు కూడా ఈ మొత్తం అందించాలని అన్నారు. గత సంవత్సరం సాగర్ కాలువ రాకపోవడం చివరి భూములలో పంట దిగుబడులు లేక నష్టపోయారని గుర్తుచేశారు. క్రోసూరు మండలంలో కొన్ని ప్రాంతాల్లో కూడా లిఫ్టుల ద్వారా పంటలు సాగవుతున్న నేపథ్యంలో గ్రామం యూనిట్‌గా నష్టపరిహారం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి తిమ్మిశెట్టి హనుమంతరావు , రైతు సంఘం మండల అధ్యక్షుడు అత్తోట వెంకట అప్పారావు , వ్యవసాయ కార్మిక సంఘం మండలాధ్యక్షుడు ఏపూరి వెంకటేశ్వర్లు, రైతు, కౌలు రైతు వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు కె తాతారావు, వల్లంశెట్టి వెంకటేశ్వర్లు, యార్లగడ్డ నాగేశ్వరరావు, షేక్ ముస్తఫా, చిలుక యేసయ్య, మరియమ్మ, మర్రి రామకృష్ణారెడ్డి, షేక్ రఫీ, దగ్గు చిన్న గోపి తదితరులు పాల్గొన్నారు.

ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షం



పట్టణంలోని శాలివాహన నగర్‌లో బురదమయంగా రహదారి



వర్షాలకు క్రోసూరులోని అమరావతి రోడ్డుపై నిలిచిన నీరు

సత్తెనపల్లి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా గురువారం రాత్రి నుంచి శుక్రవారం వరకు ఎడతెరిపి లేకుండా ముసురు పట్టి వర్షం కురిసింది. పట్టణంలోని పలు వార్డుల్లో, మండలంలోని వివిధ గ్రామాల్లో అంతర్గత మట్టి రోడ్లు బురదమయంగా మారాయి. పలుచోట్ల వర్షపు నీరు నిలిచింది. రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలిగాయి. బురద రోడ్లపై రాకపోకలు సాగించేందుకు ప్రజలు అవస్థలు పడ్డారు.

క్రోసూరు మండలంలో...

క్రోసూరు: మండలంలో గత రెండు రోజుల నుంచి జోరున వర్షం కురుస్తోంది. మధ్యలో కాస్త తెరిపినిస్తూ నిరంతరం పడుతూనే ఉంది. శుక్రవారం ఉదయం నుంచి చిరుజల్లులతో కూడిన వర్షం పడింది. రైతులు పంటల సాగు పనులకు పరుగులు పెడుతున్నారు. అనేకమంది పత్తి విత్తనాలు నాటారు. రోడ్లు, వీధులలో నీరు నిలిచిపోయింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రైతులు, ప్రజలు హర్షం వ్యక్తపరుస్తున్నారు.

అచ్చంపేట మండలంలో..

అచ్చంపేట: తుపాను ప్రభావంతో మండలంలో మూడు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. పత్తి రైతులకు ఇవి ఊరటనిస్తున్నాయి. మిర్చి నర్సరీలు కళకళలాడుతున్నాయి. ఇప్పటికైతే పత్తి పంటలకు సరిపడా వర్షాలు పడ్డాయని, ఇకపై ఎక్కువైతే మొలక దశలో ఉన్న పత్తి మొక్కలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎగువ కృష్ణానది తీరప్రాంతాలలో కురిసిన వర్షపునీరు పులిచింతల ప్రాజెక్టుకు వచ్చి చేరడంతో శుక్రవారం సాయంత్రానికి 3.61 టీఎంసీలకు సామర్థ్యం చేరింది. పూర్తి సామర్థ్యం 45.77 టీఎంసీలు. పూర్తిస్థాయిలో నిండాలంటే చాలా సమయం పడుతుందని అధికారులు పేర్కొంటున్నారు.

రైతుల సమస్యలను పరిష్కరించండి



వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం, కార్మిక సంఘ నాయకులు

పిడుగురాళ్ల: రైతుల సమస్యలను పరిష్కరించటంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని రైతు సంఘం, కార్మిక సంఘ నాయకులు అన్నారు. మండలంలోని తుమ్మలచెరువు గ్రామంలో రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సచివాలయ సిబ్బందికి రైతు సంఘం, కార్మిక సంఘ నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలలు అవుతున్నా ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయం అందలేదన్నారు. రైతులు ఎటువంటి సహాయం అందక ప్రైవేటు వ్యాపారుల వద్ద నుంచి వడ్డీకి అప్పులు తీసుకొని నానా అవస్థలు పడుతున్నారన్నారు. పీఎం కిసాన్ నిధులు రకరకాల కారణాలతో రైతులకు మోదీ ప్రభుత్వం ఎగనామం పెట్టిందన్నారు. పల్నాడు జిల్లాలో నకిలీ ఎరువులతో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

మించింగ్ తుపాన్ కారణంగా నష్టపోయిన రైతులకు ఇప్పటి వరకు ఎలాంటి సహాయం అందలేదన్నారు. గిట్టుబాటు ధర కల్పించకపోవటంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు తెలకపల్లి శ్రీనివాసరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు భక్తులు వెంకటేశ్వర్లు, రైతు సంఘం నాయకులు బుంగ నాగేశ్వరరావు, మజ్జిగ నరసింహారావు, వెన్ను వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రేపు గురుపూర్ణిమ వేడుకలు

క్రోసూరు: గురుపూర్ణిమను పురస్కరించుకుని మండల కేంద్రంలోని సాయిబాబా మందిరంలో ఆదివారం ప్రత్యేక వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు మన్నెం వెంకట్రావు శుక్రవారం తెలిపారు. మందిరంలో పది రకాల తీర్థప్రసాదాలు అందించేందుకు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.

నేడు ఐసీఎంలో శ్రీగురుగీతా హోమం



నాదెండ్ల: గణపవరం ఐడుపులపాడు కాటన్ మిల్సు ఆయిల్ డివిజన్ గోడౌన్‌లో శనివారం ఉదయం 7 గంటల నుంచి శ్రీ గురు గీతా హోమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కేతినేని శ్రీహరిరావు చెప్పారు. చిలకలూరిపేట ఆధ్యాత్మిక జ్ఞాన పీఠ వ్యవస్థాపకులు దేవిశెట్టి మల్లికార్జునరావు ఆధ్వర్యంలో 108 హోమ గుండాలతో 151 రకాల విశేష హోమ ద్రవ్యాలతో సామూహిక హోమసహిత సంపూర్ణ హోమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ హోమం వల్ల భగవంతుడి అనుగ్రహం ప్రాప్తిస్తుందని పేర్కొన్నారు. ఒక్కో హోమగుండం వద్ద ఒక్కో కుటుంబ సభ్యులు పాల్గొనేందుకు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. హోమగుండాలను ఇటుకలతో కట్టి, ఆవుపేడతో అలికి, ఇసుకతో నింపి నాలుగు వైపులా బొట్లు పెట్టి స్వస్తిక్ గుర్తులు దిద్ది, పుష్పాలతో అలంకరించినట్లు తెలిపారు.

మెనూ అమలుకు ఆదేశం

నాదెండ్ల: తూబాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మధ్యాహ్న భోజన పథకాన్ని మండలస్థాయి అధికారులు తనిఖీ చేశారు. ఎంపీడీవో షేక్ జాకీర్ హుస్సేన్, ఎంఈవో ఈమని కృష్ణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి జంగు జరీనా బేగం కలిసి పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం విద్యార్థులకు అందించాలన్నారు. ఈ పాఠశాలలో 135 మంది విద్యార్థులకు గాను 133 మంది విద్యార్థులు ఈ పథకాన్ని వినియోగించుకుంటున్నందున సంతోషం వ్యక్తం చేశారు. మెనూ తప్పకుండా విద్యార్థులకు పరిశుభ్రమైన ఆహారం అందించాలన్నారు. అనంతరం విద్యార్థినుల్లో రక్తహీనత, ఆరోగ్య సమస్యల గురించి ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీల ద్వారా అడిగి తెలుసుకున్నారు. ప్రతి వారం మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శితో కలిసి విద్యార్థినుల సమస్యలు అడిగి తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కృష్ణ, ఏఎన్ఎం మానస తదితరులు ఉన్నారు.

అమరావతి గురుకుల పాఠశాలలో తనిఖీ



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కె.సునీల్ రాజ్‌కుమార్ తదితరులు

అమరావతి: స్థానిక అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలను శుక్రవారం సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల కార్యదర్శి కె. సునీల్ రాజ్‌కుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతి గదులు, వసతిగృహం, వంటశాల, మరుగుదొడ్లు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. బోధనా పద్ధతులు, విద్యార్థుల సామర్థ్యాలను తెలుసుకున్నారు. పదో తరగతి, ఇంటర్ విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాలకు సరఫరా చేస్తున్న నిత్యావసర వస్తువులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అకడమిక్ సంయుక్త కార్యదర్శి సంజీవరావు, సంయుక్త కార్యదర్శి యోగేశ్వరరావు, రాజేష్, వైస్ ప్రిన్సిపల్ మేరీకళ, సిబ్బంది పాల్గొన్నారు.

మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించండి



రాజుపాలెం జెడ్పీ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న అధికారులు



అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

రాజుపాలెం: మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని మండల ప్రత్యేక అధికారి కె.ఉమారాణి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని రాజుపాలెం జిల్లా పరిషత్ పాఠశాలలోని మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వాహకులతో మాట్లాడుతూ నాణ్యత పెంచాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. తరువాత సమీపంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని పరిశీలించారు. రికార్డులను చూసి ఓపీ, సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాలలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి డయేరియా, దోమల నివారణకు చర్యలు చేపట్టాలని తెలిపారు. అనంతరం ఎస్సీ కాలనీలోని అంగన్‌వాడీ సెంటర్‌ను తనిఖీ చేశారు. విద్యార్థుల సంఖ్య పెంచాలని సూచించారు. రికార్డులను పరిశీలించారు. తరువాత మండల పరిషత్ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. చిన్నారుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంపీడీవో శివరామకృష్ణ ప్రసాద్, ఈవోపీఆర్డీ పగడాల ముక్కంటి, ఎంఈవో–2 నరసింహారావు, కో ఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ రవితేజ నాయక్, హెల్త్ సూపర్‌వైజర్ జీవన్‌రావు, సీడీపీఓ టి.శ్రీలత, సూపర్‌వైజర్ కేవీ రమాదేవి, పి.ప్రసన్న, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకానికి సహకారం

ముప్పాళ్ల: జాతీయ ఉపాధి హామీ పథకం కింద పండ్ల తోటల పెంపకంపై రైతులు దృష్టి సారించాలని మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో క్షేత్రస్థాయి వ్యవసాయశాఖ, ఉద్యాన శాఖ సిబ్బందికి శుక్రవారం ఈ అంశంపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఏఓ అరుణ మాట్లాడుతూ.. రైతులకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పిస్తామన్నారు. పథకం ఏపీఓ జి.ఏడుకొండలు మాట్లాడుతూ.. మండలంలో 200 ఎకరాల్లో పండ్ల తోటల పెంపకం చేపట్టాల్సి ఉందన్నారు. 19 రకాల మొక్కలను, సాగుకు ఆర్థిక ప్రోత్సాహం అందిస్తామన్నారు. ఐదెకరాల లోపు రైతులు అర్హులని చెప్పారు. పట్టాదారు పాసుపుస్తకం, నీటి సదుపాయం, జాబ్‌కార్డు కలిగి ఉండాలన్నారు. ఆసక్తి కలిగిన వారు తమను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారి నవీన్, పథకం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు పరిహారం అందించాలి



వీఆర్వోకు వినతిపత్రం అందిస్తున్న రైతు సంఘం నాయకులు

నకరికల్లు: తుపాను కారణంగా గతేడాది పంట నష్టపోయిన కౌలు రైతులకు కూడా పరిహారం అందించాలని మండల కౌలు రైతు సంఘం అధ్యక్షుడు జి.పిచ్చారావు డిమాండ్ చేశారు. నష్టపోయిన పలువురు రైతులతో కలిసి మండలంలోని చేజర్ల గ్రామ సచివాలయం రెవెన్యూ అధికారికి గురువారం ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వర్షాభావ పరిస్థితుల కారణంగా పల్నాడులో కరవు పరిస్థితులు ఏర్పడ్డాయని అన్నారు. తుపాను కారణంగా రబీ పంట పూర్తిగా దెబ్బతిందన్నారు. కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిన అన్నదాత సుఖీభవ ద్వారా రూ.20 వేలు కౌలు రైతుల ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేశారు. భూమి లేని కౌలు రైతులను గుర్తించి గుర్తింపు కార్డులు మంజూరు చేయాలన్నారు. ఉపాధి హామీ పథకం పెండింగ్ బిల్లులు సత్వరమే చెల్లించాలని కోరారు. వ్యవసాయ విద్యుత్ మీటర్లను అమలు చేయకుండా జీఓ నంబర్ 22ను రద్దు చేసి, ఉచిత విద్యుత్ కొనసాగించాలని పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకంలో 200 రోజులు పని కల్పించాలన్నారు. ఈ మేరకు వినతిపత్రాన్ని వీఆర్వో కృష్ణకుమారికి అందజేశారు. రైతు సంఘం నాయకులు ఈవూరి అప్పిరెడ్డి, చట్టు కోటేశ్వరరావు, దుర్గాబాయి, కొండానాయక్, రామాంజినాయక్, జి.ఏడుకొండలు, ఆవుల వెంకటేశ్వర్లు, సీహెచ్ రమేష్, ఈవూరి గోవిందరెడ్డి, కొత్తపల్లి దేవసహాయం పాల్గొన్నారు.

ఖరీఫ్‌లో యాజమాన్య పద్ధతులు పాటించాలి



మాట్లాడుతున్న శాస్త్రవేత్త డాక్టర్ నగేష్

సత్తెనపల్లి: ఖరీఫ్ సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలని లాం ఫాం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్త డాక్టర్ ఎం. నగేష్, సమన్వయ కర్త డాక్టర్ ఎం. వెంకట రాములు సూచించారు. పట్టణంలోని అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లో మండలంలోని గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ ఉద్యాన సహాయకులకు శుక్రవారం నిర్వహించిన శిక్షణలో వారు మాట్లాడారు. ప్రస్తుతం పత్తి పంటలో అధిక వర్షాల సమయంలో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించాలన్నారు. మిరప నారు మడులలో చేపట్టవలసిన విత్తన శుద్ధి, యాజమాన్య పద్ధతులను వివరించాలని కోరారు. వరి పంటలో తక్కువ కాలపరిమితి, తెగుళ్లను తట్టుకునే వంగడాలపై అవగాహన పెంచాలని సూచించారు. శిక్షణలో గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ ఉద్యాన సహాయకులు, తదితరులు ఉన్నారు.

బీమా పరిహారం అందించాలని విజ్ఞప్తి



వినతి పత్రం అందిస్తున్న బాధిత రైతులు

పెదకూరపాడు: గతంలో తుపానుతో నష్టపోయిన రైతులకు బీమా పరిహారం అందించాలని రైతు, కౌలు రైతు సంఘం నాయకులు పెదకూరపాడులోని పంచాయతీ కార్యదర్శి సుధారాణి, గ్రామ సర్పంచి గుడిపూడి రాజుకు శుక్రవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ.. ఖరీఫ్‌లో కరవు పరిస్థితులు ఉన్నాయని చెప్పారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పంట బీమా పరిహారం అందించాలన్నారు. నేరుగా రైతుల ఖాతాలో జమ చేయాలని కోరారు. వ్యవసాయ విద్యుత్ మీటర్లు బిగించరాదని పేర్కొన్నారు. జీవో నెం.22ను రద్దు చేసి ఉచిత విద్యుత్ కొనసాగించాలని కోరారు. గ్రామ సభలు నిర్వహించి భూ యజమాని అనుమతులు లేకుండానే కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందించాలన్నారు. ఉపాధి హామీ పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతులకు పెట్టుబడి సహాయం పథకం అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు దర్శి శేషారావు, బంకా దాసు, బుజ్జి, గంగయ్య, అంద్ర శ్రీను, ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

యడ్లపాడు మండల ప్రత్యేక అధికారి బాధ్యతల స్వీకరణ

యడ్లపాడు: మండల నూతన ప్రత్యేక అధికారిగా ఎ.సుబ్రమణ్యం శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు యడ్లపాడు మండల ప్రత్యేక అధికారిగా పనిచేసిన రాధారాణి ఇటీవల పదవీ విరమణ చేశారు. దీంతో ఆమె స్థానంలో పల్నాడు, గుంటూరు జిల్లాల సెరికల్చర్ విభాగ అధికారిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. అన్ని శాఖలకు చెందిన అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రధానంగా మండలంలోని అన్ని గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుపరచాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం తిమ్మాపురం ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ వరూధిని, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.